# కథ

**అరుణ**

సమయం ఉదయం పది గంటలవుతోంది.

పట్టణం నడిబొడ్డులో ఉన్న ఒక జాతీయ బ్యాంక్ శాఖ అది.

త్వర త్వరగా బ్యాంక్‌లోకి వచ్చాడు పవన్. రెండు రోజులు సెలవు పెట్టి పని మీద హైదరాబాద్ వెళ్లి వచ్చాడతను.

సీనియర్ మేనేజర్ సత్యనారాయణ రెడ్డి కౌంటర్ వద్ద నిలబడి రెగ్యులర్‌గా వచ్చే ఓ ఖాతాదారుణ్ణి చిరునవ్వుతో పలకరిస్తున్నాడు.

ప్రతి రోజూ ఉదయం పూట కౌంటర్ వద్ద కొద్ది నిమిషాలు ఉండి తన క్యాబిన్‌లోకి వెళతాడాయన. ఆ సంగతి స్టాఫ్ అందరికీ తెలుసు కాబట్టి పంక్చువాలిటీ పాటిస్తారు.

నోరు తెరిచి ఒక్క మాట కూడా అనకుండా సిబ్బందిని క్రమశిక్షణగా ఉంచడంలో ఆయన సిద్ధహస్తుడు.

"గుడ్ మార్నింగ్ సర్!" సీనియర్ మేనేజర్‌కు విష్ చేస్తూ తన సీటు వద్దకు వెళ్లి కూర్చున్నాడు పవన్. ఆయన నవ్వుతూ తల ఊపి తిరిగి కస్టమర్‌తో మాట్లాడసాగాడు.

సిస్టమ్ ఆన్ చేసి పక్క సీటులో ఉన్న ఆఫీసర్ మూర్తివైపు చూసి పలకరింపుగా నవ్వాడు పవన్.

మూర్తిగారి సీటుకు అవతలి వైపు ఓ అపరిచిత యువతి కూర్చుని తల వంచుకుని చేతిలోని క్లియరింగ్ చెక్కులను పరిశీలిస్తూ కంప్యూటర్‌లో నమోదు చేస్తోంది.

ఆమె వైపు పవన్ ప్రశ్నార్థకంగా చూడడం గమనించాడు మూర్తి.

"తన పేరు సుధ. నిజామాబాద్ నుండి ట్రాన్స్‌ఫరై వచ్చారు. మొన్న జాయినయ్యారు" ఆమెను పరిచయం చేశాడు.

"ఇతను పవన్. ఈ రెండు రోజుల నుండి సెలవులో ఉన్నారు" ఆమెతో చెప్పాడు మూర్తి.

ఇరువురి సీట్లకు మధ్యలో మూర్తి అడ్డుగా ఉండడంతో సీటులో కొద్దిగా ముందుకు వంగి పలకరింపుగా నవ్విందామె.

పవన్ కూడా నవ్వాడు.

ఆమెను ఎక్కడో చూసిన ఫీలింగ్.

కొద్దిక్షణాలు గడిచాయి.

చటుక్కున గుర్తొచ్చింది పవన్‌కు. అతని పెదవుల మీద చిరునవ్వు కదలాడింది.

పదిరోజుల క్రితం సుధ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ కాపీ బ్రాంచ్‌కు అందింది. కానీ ఈమె తనకు తెలిసిన సుధ అని ఊహించలేకపోయాడు.

నోరు తెరిచి సంభ్రమంగా ఏదో అనబోయాడు.

"నా ఎకౌంట్‌లో బ్యాలెన్స్ ఎంత ఉందో చెబుతారా?" ఓ అందమైన యువతి చెక్ చూపిస్తూ అడుగుతోంది.

ఆమె ఖాతాలోని బ్యాలెన్స్ చెప్పాడు పవన్.

త్వరగా చెక్ పూర్తి చేసి అతనికి ఇవ్వబోయింది.

"సంతకం పెట్టడం మరచిపోయారు" నవ్వాడు పవన్. ఆమె నవ్వి సంతకం చేసి చెక్ అతనికి అందించింది.

మరో ఇద్దరు ఖాతాదారులు పాస్ పుస్తకాలు పట్టుకుని నిలబడ్డారు.

కొద్ది నిమిషాల తర్వాత చేతిలో పని పూర్తయ్యాక లేచి సుధ సీటు వద్దకు వెళ్లాడు పవన్.

"నేనెవరో మీకు గుర్తొచ్చిందా?" చొరవగా అడిగాడు.

పని ఆపి తల తిప్పి అతని వైపు చూసింది. "ఎక్కడో చూసినట్టు అనిపిస్తోంది. గుర్తురావడం లేదు" కొద్దిక్షణాల తర్వాత నెమ్మదిగా అంది.

"గుంటూరు కొరిటిపాడులో మీరు, మేము ఒకే వీధిలో ఉండేవాళ్లం. వైదేహి వాళ్ల అన్నయ్యను నేను. గుర్తొచ్చిందా?" అడిగాడు.

ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి.

"గుర్తొచ్చింది. వైదేహి ఏం చేస్తోంది?" అడిగింది.

"పెళ్లయింది. మా బావగారు విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నారు"

అలాగా అన్నట్టు చూసింది.

"మీ అన్నయ్య ఏం చేస్తున్నాడు?" ప్రశ్నించాడు పవన్.

"బెంగుళూరులో టాటా కన్సల్టెన్సీలో పని చేస్తున్నాడు. ప్రాజెక్ట్ వర్క్ మీద రెండు నెలల క్రితం స్విట్జర్లాండ్ వెళ్లాడు. మరో వారం రోజుల్లో వచ్చేస్తాడు" చెప్పింది సుధ.

"వెరీగుడ్"

కస్టమర్ వచ్చి తన సీటు ఎదురుగా నిలబడడం గమనించి అక్కడి నుండి వచ్చేశాడు.

చలాకీగా సర్వీస్ చేస్తున్న పవన్‌వైపు ఓ క్షణం చూసి పనిలో నిమగ్నమైందామె.

పనిచేస్తోందే కానీ లోలోపల ఆశ్చర్యంగా ఉంది సుధకు.

చిన్నప్పుడు తనకు తెలిసిన పవన్ ఇప్పుడు ఇలా తారసపడడం ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

తన అన్నయ్య సాయి, ఈ పవన్ ఇద్దరూ ఒకే తరగతి. అతని చెల్లెలు వైదేహి, తను క్లాస్‌మేట్స్. చదువులో కాస్త వెనుకబడి ఉండేవాడు పవన్.

సెలవురోజుల్లో తను వైదేహితో చెస్ ఆడుకోవడానికి వాళ్ల ఇంటికి వెళ్లేది. తనకంటే వైదేహి చదరంగం బాగా ఆడేది. ఆటలో ఎలా ఎత్తులు వేయాలో ఓర్పుగా తనకు వివరిస్తూ ఆడే వైదేహి అంటే సుధకు చాలా ఇష్టం.

ఒకసారి తను వాళ్ల ఇంటికి వెళ్లేటప్పటికి వైదేహి లేదు. బజారుకు వెళ్లిందని ఆంటీ చెప్పారు. వెనుతిరిగి రాబోతున్న తనకు అప్పుడే ఇంట్లోకి వస్తున్న పవన్ ఎదురయ్యాడు.

"ఏమిటి బొద్దుపిల్లా! అప్పుడే వెళ్ళిపోతున్నావు. మా చెల్లాయి లేదా?" అని అడిగాడు.

సుధకు కోపం వచ్చేసింది.

"ఏమిటి మొద్దబ్బాయ్?! అప్పుడే ఆటలు అయిపోయాయా? త్వరగా ఇంటికి చేరుతున్నావు" ఎగతాళిగా అంది.

స్కూల్‌లో చాలామంది ఆ పేరుతో పిలిచినా పట్టించుకోని పవన్‌కు ఆమె అలా పిలవడంతో అహం దెబ్బతింది.

దూకుడుగా దగ్గరకు వచ్చాడు.

"ఏమన్నావ్? ఆ మాట మళ్లీ అను! బాగా చదువుతావని నీకు పొగరు జాస్తి" అన్నాడు.

"పదిసార్లు అంటాను. నాకు భయమా? మొద్దబ్బాయి...మొద్దబ్బాయి...మొద్దబ్బాయి..." అంది.

"నన్ను మొద్దు అంటావా? నువ్వు ఎంత లావుగా ఉన్నావో అద్దంలో చూసుకో. నేను మొద్దబ్బాయిని అయితే నువ్వు బొద్దుపిల్లవి, బండ పిల్లవి" అన్నాడు.

సుధకు దుఃఖం ఎగదన్నుకొచ్చింది. కళ్లలో నీళ్లు నిలిచాయి.


బంగారువర్ణంలో, ఆరోగ్యంగా మిస మిసలాడుతుండేది తను. ఇంట్లో అందరికీ తనంటే గారాబమే. అపురూపంగా చూసుకుంటారు కానీ ఎవ్వరూ ఒక్క మాట అనరు.

కళ్లు తుడుచుకుని నిశ్శబ్దంగా ఇంటికి వచ్చేసింది.

గదిలోకి వెళ్లి అద్దంలో చూసుకుంది.

నిజంగా తను లావుగానే ఉంటుంది. కానీ ఆ మాట ఎవ్వరూ ప్రస్తావించరు.

# మొద్దబ్బాయి బొద్దుపిల్ల



క్లాస్‌లో తను చురుగ్గా ఉంటుంది. ఫస్ట్‌ర్యాంక్ ఎప్పుడూ తనదే! క్లాస్‌మేట్స్‌తో కాని, టీచర్లతో కానీ ఎన్నడూ వేలెత్తి చూపించుకోలేదు. అలాంటిది ఈవేళ పవన్ తనను గేలి చేశాడు. పన్నెండేళ్ల వయసులో వున్న ఆ అమ్మాయి కళ్లలో నీరు సుడులు తిరిగింది.

అతను అన్న మాట పదే పదే మనసులో మెదులుతోంది. సాయంత్రమయ్యేటప్పటికి సుధకు జ్వరం వచ్చింది.

“పిల్లకు ఎవరి దిష్టి తగిలిందో ఏమో!” అంటూ బామ్మ ఎండు మిరపకాయలతో దిష్టి తీసింది. ఆరోజు ఆమెకు బాగా గుర్తు. తండ్రి ఊరికి వెళ్లాడు. జోరున వర్షం కురుస్తోంటే అన్నయ్య వెళ్లి ఆటో తీసుకువచ్చాడు.

అమ్మా, అన్నయ్య తనను పొదివి పట్టుకుని ఆటోలో ఎక్కించి హాస్పిటల్‌కు తీసుకు వెళ్లారు. రెండు రోజుల్లో జ్వరం తగ్గుముఖం పట్టినా బాగా నీరసించి చిక్కిపోయింది. మరో రెండు రోజులు గడిచాక స్కూలుకు వెళ్లిన సుధను చూసి టీచర్లు, తోటి విద్యార్థులు ఆశ్చర్యపోయారు.

నల్లబడి, సగానికి సగం తగ్గిపోయిందామె.

వైదేహి కోసం వాళ్ల ఇంటికి వెళితే పవన్ కనిపించాడు.

“సారీ సుధా! ఆ రోజు నేను అలా అనడం వల్లే నీకు జ్వరం వచ్చింది కదూ! ఇంకెప్పుడూ ఆ మాట అనను” అతని గొంతులో గిల్టీనెస్ స్పష్టంగా తెలిసింది.

సుధ మాట్లాడలేదు. వైదేహితో కాస్సేపు చదరంగం ఆడుకుని వచ్చేసింది.

ఆ తర్వాత ఇంకెన్నడూ పవన్ ఆమెతో మాట్లాడడానికి ప్రయత్నించలేదు.

వేసవి సెలవుల్లో తండ్రికి నెల్లూరు ట్రాన్స్‌ఫర్ అవడంతో సుధ వాళ్లు గుంటూరు నుండి వెళ్లిపోయారు.

తర్వాత పవన్‌ను మళ్లీ ఇప్పుడే చూడడం.

జ్ఞాపకాల నుండి బయటపడి తల తిప్పి పవన్ సీటు వైపు చూసింది.

పని ఒత్తిడిలో బిజీగా ఉన్నాడతను.

క్లియరింగ్ పని పూర్తయ్యాక, కలెక్షన్‌కు పంపాల్సిన చెక్కులను టేబిల్ సొరుగులో నుండి తీసింది సుధ.

మధ్యాహ్నం రెండు గంటలకు లంచ్ టైమ్‌లో భోజనం చేస్తున్న సుధను కొద్దిక్షణాలు పరిశీలనగా చూసి తల తిప్పుకున్నాడు పవన్.

బొద్దుపిల్ల అని పది సంవత్సరాల క్రితం తాను ఏడిపించి బాధ పెట్టిన సుధ ఇప్పుడు 22 యేళ్ల వయసులో పసిమి వర్ణంలో నాజూకుగా మళ్లీ మళ్లీ చూడాలనిపించేంత చక్కగా ఉంది. ఆమె మెడ వైపు చూశాడు. సన్నని బంగారు గొలుసుకు అమర్చిన చిన్న లాకెట్ ఆకర్షణీయంగా ఉంది. సీటులో కొద్దిగా వెనక్కి జరిగి డైనింగ్ టేబిల్ కింద ఆమె పాదాల వైపు దృష్టి సారించాడు. కాళ్లు అందంగా కనిపిస్తున్నాయి కానీ పాదాల వేళ్లకు ఎటువంటి ఆభరణాలు లేవు.

అలా చూసినందుకు తనలో తాను కొద్దిక్షణాలు గిల్టీగా ఫీలై వెను వెంటనే సర్దుకున్నాడు.

పక్కనే కూర్చున్న సహోద్యోగి సుభద్ర అడిగిన మాటకు క్లుప్తంగా సమాధానమిచ్చి భోజనం చేస్తోంది సుధ.

"మీ నాన్నగారు ఎక్కడ పనిచేస్తున్నారు?" భోజనం ముగించి మంచినీళ్లు తాగుతూ అడిగాడు.

తలెత్తి అతని వైపు చూసింది సుధ.

"ఇక్కడే పని చేస్తున్నారు"

"మీకు సుధ ఇంతకుముందే తెలుసా?" సుభద్ర అడిగింది.

పవన్ నవ్వాడు.

"చిన్నప్పుడు గుంటూరులో ఒకే వీధిలో ఉండేవాళ్లం. స్కూలులో మా చెల్లెలు, తను క్లాస్‌మేట్స్. వాళ్ల అన్నయ్య, నేను ఒకే క్లాస్" వివరంగా చెప్పాడు.

మూర్తి ఏదో మాట్లాడడంతో సంభాషణ దారి మళ్లింది.

రోజులు గడుస్తున్నాయి.

సుధ పట్ల మనసులో ఇష్టంగా అనిపిస్తోంది పవన్‌కు. మనసులో ఏదో తీయని భావన. కానీ ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తెలియడం లేదు.

సినిమాల్లోను, నవలల్లోను యువతీ యువకులు ప్రేమను వ్యక్తం చేసినంత సులువుగా నిజ జీవితంలో చెప్పడం చాలా కష్టమని అతనికి అర్థమవుతోంది.

చిన్నప్పుడు తెలిసిన వాడినే గదా! కనీసం ఇంటికి రమ్మని పిలవొచ్చు. కానీ ఎన్నడూ అలా పిలవలేదు. పోనీ కలుపుగోలుగా మాట్లాడుతుందా అంటే అదీ లేదు. ఏదైనా అడిగితే అంటీ ముట్టనట్టు పొడి పొడిగా జవాబు చెప్పి ఊరుకుంటుంది. ఈ అమ్మాయికి తన మనసులో మాట ఎలా చెప్పాలి? పవన్ ఆలోచిస్తున్నాడు.

అతన్ని చూస్తుంటే సుధకు ఇంకా ఆశ్చర్యంగానే ఉంది.

చిన్నప్పుడు క్లాస్‌లో పాఠాలు అర్థంకాక, సరిగా హోం వర్క్ చేయకుండా ప్రతి రోజూ ఈ అబ్బాయి టీచర్లతో తిట్లు తింటాడని అన్నయ్య చెబుతుండేవాడు. అలాంటి వాడు ఇప్పుడు ఎంత చురుగ్గా, చలాకీగా తయారయ్యాడు? మొద్దబ్బాయిగా పేరుపడ్డ పవన్ ఇప్పుడు ఉద్యోగం చేస్తున్నాడంటే ఆశ్చర్యంగా ఉంది. వేగంగా, తప్పులు దొర్లకుండా పనిచేస్తూ, కష్టమర్లకు చక్కటి సేవలందిస్తాడతను. ఖాతాదారులతోను, కొలీగ్స్‌తోను సరదాగా మాట్లాడుతూ ఎంతో యాక్టివ్‌గా ఉంటాడు అనుకుంది లోలోపల.

అతని పట్ల తాను ఆకర్షణకు గురవడం ఆమెకు తెలుస్తూనే ఉంది. కానీ ఈ విషయం పవన్‌తో ఎలా చెప్పాలి? సందిగ్ధంలో పడింది.

మంగళవారం సాయంత్రం బ్యాంక్ నుండి ఇంటికి వెళ్లి స్నానం చేసి ఆంజనేయ స్వామి గుడికి వెళ్లింది సుధ.

దర్శనమయ్యాక విశాలమైన ఆవరణలో ఓ వైపున కూర్చుంది. యథాలాపంగా పక్కకు తిరిగి చూసిన ఆమెకు పవన్ కనిపించాడు.

ఆమె తన వైపు చూడడంతో పలకరింపుగా నవ్వాడు. సుధ కూడా నవ్వింది. అతని మనసు తొందర పెడుతోంది. అనుకోకుండా ఆమె ఒంటరిగా కలిసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. కానీ గొంతు పెగలదేమిటి? రెండు నిమిషాలు మౌనంగా ఉండిపోయాడు.

అతను ఏమైనా మాట్లాడితే బాగుండునని ఆమె ఆశగా ఎదురుచూస్తోంది.

"సుధా!" ఏకవచనంలో పిలిచాడు.

అతని ముఖంలోకి ఇష్టంగా చూసింది.

ఆ చూపులకు అర్థం తెలియక తడబడ్డాడు.

అందంగా పొడవుగా ఉన్న సుధ చేతి వేళ్ల వైపు కొద్దిక్షణాలు చూశాడు. నిన్ననే గోరింటాకు పెట్టుకుంది కాబోలు చేతులు ఎర్రగా పండాయి. గోరింటాకు వల్ల పసిమి వర్ణంతో ఉన్న ఆమె చేతులు ఇంకా అందంగా కనిపిస్తున్నాయి. తన మనసులో మాట చెబితే కొంపదీసి కొట్టదు కదా అనిపించింది.

ధైర్యం తెచ్చుకున్నాడు. ఎలా మొదలుపెట్టాలో ఆలోచిస్తూ మాటలు సమకూర్చుకుంటున్నాడు లోలోపల.


ఆమెకు అర్థమైంది. మనసులో ఆనందం ఉవ్వెత్తున ఎగసిపడింది.

పవన్ తనను ఇష్టపడుతున్నాడని, కానీ నోరు తెరిచి చెప్పడానికి వెనకాడుతున్నాడని గ్రహించింది. ఇక లాభం లేదు. తానే చొరవ తీసుకోవాలి అనుకుంది.

"నన్ను ఇష్టపడుతున్నారా? పెళ్లి చేసు

## మరో చాన్స్

**ఇటీవల** 'యమదొంగ' సినిమాలో 'నాచోరే నాచోరే' పాటకి డాన్స్‌తో జనాల్లోకి తిరిగి వచ్చిన రంభకి హీరోయిన్‌గానూ మరో చాన్స్ దొరికినట్టయిందిప్పుడు. ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్న 'దొంగ సచ్చినోళ్లు' సినిమా విడుదలయ్యాక కెరీర్ కొత్త మలుపు తిరుగుతుందని సినీజనాలే కాదు, ఆమె కూడా భావిస్తోందిట. వయసు పైబడుతున్నా గ్లామర్‌ని పెంచుకుంటున్న రంభకి మంచి జరగాలనే కోరుకుందాం.


కథా నిలయం
శ్రీకాకుళం

కోవాలనుకుంటున్నారా?" సూటిగా అడిగింది.

గాభరాపడ్డాడు.

రెండుసార్లు తల అడ్డంగా ఊపాడు.

ఆ తర్వాత అవునన్నట్లుగా తల గబగబా ఊపాడు నాలుగైదుసార్లు.

తన మనసులో ఉన్న మాట ఈ అమ్మాయికి ఎలా తెలిసిందో బోధపడలేదు.

అతని టెన్షన్ ఆమెకు నవ్వు తెప్పించింది. ఫక్కున నవ్వింది.

హమ్మయ్య అనుకున్నాడు.

ఆమె నవ్వులో అంగీకారం, సంతోషం కనిపించాయతనికి.

ఇంత సులభంగా ఇష్టమైన అమ్మాయి పెళ్లికి అంగీకరిస్తుందనుకోలేదు. మనసు పట్టరాని సంతోషంతో సయ్యాటలాడింది. లోలోపల దేవుడికి థ్యాంక్స్ చెప్పుకున్నాడు.

"మన పెళ్లి విషయం మీ నాన్నగారితో మాట్లాడతాను" అన్నాడు.

"ఊహూ! వద్దు. మా అమ్మ, నాన్న కాకినాడ వెళ్లి మీ పెద్దవాళ్లతో మాట్లాడతారు" నవ్వింది.

కొద్దిసేపు మౌనంగా కూర్చున్నారు.

ఆ నిశ్శబ్దం చాలా బావుంది వారికి.

ఆమెతో ఓ సంగతి చెప్పాలనిపించింది.

"చిన్నప్పుడు నేను చదువుమీద శ్రద్ధ చూపించకుండా అల్లరి చిల్లరిగా తిరిగేవాడ్ని. మొద్దబ్బాయి అని ఎంతమంది గేలి చేసినా పట్టించుకునేవాడ్ని కాదు. కానీ ఆ మాట నీ నోటి నుండి రావడంతో నా అహం దెబ్బ తింది. అప్పుడు నేను తొమ్మిదో తరగతిలో ఉన్నాను. నాలో మార్పు రావాలని తెలుసుకున్నాను. కఠోర సాధన చేసి మొద్దబ్బాయి అనే ముద్ర నుండి బయటపడ్డాను. తొమ్మిదో తరగతిలో కాస్త మంచి మార్కులే వచ్చాయి. నా మీద నాకు నమ్మకం ఏర్పడింది. రెట్టించిన ఉత్సాహంతో పదవ తరగతిలో కష్టపడ్డాను. కృషికి తగిన ఫలితం ఉంటుందని స్వానుభవంతో అర్థమైంది. అందులోని ఆనందాన్ని చవి చూశాను. ఇంటర్మీడియట్‌లో కూడా మంచి మార్కులు తెచ్చుకున్నాను. బి.కామ్ చదువుతూ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యాను. రెండేళ్ల నుండి మన బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నాను. మొన్నామధ్య హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్.." ఆగిపోయాడు.

"చెప్పండి" అంది.

"ఊహూ! ఏమీ లేదు" అతని ముఖంలో కొంటెదనం తొంగి చూసింది.



"తెలిసీ తెలియని వయసులో నిన్ను బొద్దుపిల్ల అని ఏడిపించాను. ఆ మాటతో జ్వరం వచ్చి చిక్కి సగమయ్యావు. ఇంకెప్పుడూ నిన్ను నొప్పించను. మన పెళ్లయ్యాక మళ్లీ నువ్వు లావుగా తయారైనా కూడా ఆ మాట అనను" నవ్వాడు.

అతని నవ్వుతో సుధ శృతి కలిపింది.

వారం తర్వాత-

తన పేరిట స్టేట్‌బ్యాంక్ నుండి వచ్చిన కవర్ తెరిచాడు పవన్. అతని ముఖం ఆనందంతో విప్పారింది.

జేబులో నుండి సెల్ తీసి తల్లికి ఫోన్ చేసి ఓ శుభవార్త చెప్పాడు.

అతను ఫోన్‌లో మాట్లాడుతుండగానే పక్క సీటులోని మూర్తికి విషయం తెలిసింది.

"పవన్ స్టేట్ బ్యాంక్‌లో ఆఫీసర్‌గా సెలెక్టయ్యాడు" స్టాఫ్ అందరికీ వినిపించేటట్లు బిగ్గరగా చెప్పాడు.

అందరూ అభినందనలు తెలిపారు. సంబరంగా చూసింది సుధ.

అనుక్షణం అతని శ్రేయస్సుకోసం పరితపించే తల్లిదండ్రులకు అందరికంటే ముందు ఈ శుభవార్త చెప్పడం ఆమెకు ఆనందాన్ని కలిగించింది.

అప్రయత్నంగా ఆమె వైపు చూసి నవ్వాడు. అతని చూపులు క్షణకాలం ఆమె కనులతో సంభాషించాయి.

మొన్నామధ్య హైదరాబాద్‌లో స్టేట్‌బ్యాంక్ ఆఫీసర్ ఇంటర్వ్యూకు వెళ్లాడు కాబోలు. గతవారం గుడిలో కలుసుకున్నప్పుడు అతను చెప్పబోయి మధ్యలో ఆపేసిన మాట గుర్తుకొచ్చింది. తల వంచుకుని తనలో తాను నవ్వుకుంది మురిపెంగా.

అంతకుముందు రోజే ఆమె తల్లిదండ్రులు కాకినాడ వెళ్లి పవన్ అమ్మా నాన్నలతో మాట్లాడి సంబంధం ఖాయం చేసుకుని వచ్చారు.

"మొత్తానికి అనుకున్నది సాధించావు. ఇక పెళ్లి కుదరడమే తరువాయి" అన్నాడు మూర్తి.

"పెళ్లి కూడా కుదిరింది" చెప్పాడు పవన్.

"అమ్మాయిది ఏ ఊరు? పెళ్లి చూపులు ఎప్పుడు జరిగాయి?" అడిగాడాయన.

"అమ్మాయిది ఈ ఊరే! ప్రత్యేకంగా పెళ్లి చూపులంటూ ఏమీ జరగలేదు. చిన్నప్పటి నుండి తెలిసిన కుటుంబం" సుధ వైపు చూడకుండా కంట్రోల్ చేసుకోడానికి అజయ్ కాస్త ఇబ్బంది పడాల్సి వచ్చింది.

విషయం అంతకుముందు రోజే తెలిసిన సుధ పక్క సీటులోని సుభద్ర ముసి ముసిగా నవ్వింది.

ooo

చిన్నప్పటి మొద్దబ్బాయి ప్రయోజకుడై తల్లిదండ్రులకు ఆనందాన్ని కలిగించాడు. 24 యేళ్ల ఆ యువకుడు నవవధువు చెక్కిలి మీద పెదవులతో మృదువుగా స్పృశించాడు.

ఆమె తల కొద్దిగా పక్కకు తిప్పుకుంది సిగ్గుతో.

"ఆరోజు గుడిలో చూపించిన మాటల స్పీడు ఈ వేళ ఏమైంది?" ఆమె పొడవైన జడను చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

ముగ్ధమనోహరంగా నవ్వి బిడియాన్ని విడనాడి అతనికి చేరువగా జరిగి కూర్చుంది.

o

## శోభన పెళ్లికూతురాయెనే!

పెళ్లి గురించిన విషయంలో మొదట్నుంచీ కాస్త దూరంగానే వుంటూవస్తున్న శోభన ఇన్నాళ్లకి పెళ్లికూతురవుతోంది. నెట్ చాటింగ్ ద్వారా ఫ్రెండయిన 'రాహుల్' అనే ఆసామీతో శోభన పెళ్లి జరగబోతోందిట. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇతనితో చాటింగ్ ద్వారా స్నేహం ఏర్పడి అదే క్రమంగా ప్రేమగా మారిందిట. 42 ఏళ్ల శోభన మనసు గెలిచిన ఈ రాహుల్ మహాశయుడు ఓ రైతు కుటుంబానికి చెందినవాడట. అందుకే అంటారు, మారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్ అని!